# ట్రీట్‌మెంట్

"మనకు కొత్త సూపరింటెండెంట్‌గా కోటేశ్వరావుని వేసారు సార్" అన్నాడు రికార్డు అసిస్టెంట్ నిత్యానందం, సీనియర్ అసిస్టెంట్ చింతామణితో.

తాను అల్లిన గూట్లోకి వస్తున్న ప్రాణిని చూసి ఆనందించే సాలెపురుగులా తన భక్షణ కోసం వస్తున్న పూర్‌ఫెలో సూపరింటెండెంట్ మీద జాలిపడ్డాడు చింతామణి.

ఈ వార్త క్షణాల్లో సెక్షనంతా వ్యాపించింది. దళసరి అద్దాల టైపిస్టు ప్రేమాంజలి, క్యాలికులేటరుతో ఆడుకుంటున్న క్యాషియర్ కూర్మానందం, చెప్పుడు మాటలు శ్రద్ధగా వినే సీనియర్ అసిస్టెంట్ చింతామణి, జడివాన కురిసినా జడవని జూనియర్ అసిస్టెంట్ జస్వంతరావు, పావలాపెట్టి కొనుక్కొని పాత చందమామలు చదివే అటెండరు అప్పారావు... ఇలా అందరూ ఎదురు చూస్తుండగా ఆ దురదృష్ట క్షణాన సెక్షనులో అడుగుపెట్టాడు కొత్త సూపరింటెండెంట్ కోటేశ్వరరావు.

అతను గదిలోకి వెళ్ళాలంటే సెక్షను మధ్యలోంచే వెళ్లాలి. కోటేశ్వర రావు హాలు మధ్యలో నిలబడి తనను తాను పరిచయం చేసుకుని అందరికీ నమస్కారం పెట్టాడు. ఎవరూ ప్రతి నమస్కారం చేయలేదు సరికదా స్వీపరుతో సహా ఎవరూ సీట్లలోంచి గౌరవపూర్వకంగా లేవలేదు. అవన్నీ పట్టించుకోని కోటేశ్వరరావు అందరికీ తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"అందరూ నా గదిలోకి రండి. జస్ట్ బిస్కెట్ తిని, టీ త్రాగి సెక్షన్ విషయాలు డిస్కస్ చేసుకుందాం" అంటూ ఆహ్వానించి తన గదిలోకి వెళ్ళాడు.

"అల్లుడికి ఐశ్వర్యమిస్తే అర్థరాత్రివేళ గొడుగు తెమ్మన్నాడట. అట్లుంది ఆయన పరిస్థితి" ప్రేమాంజలి మాటలకు అందరూ గొల్లున నవ్వారు.

తన సీట్లో కూర్చున్న కోటేశ్వరరావు తన బ్యాగ్‌లోంచి బిస్కెట్ ప్యాకెట్ తీసి టేబుల్ మీద పెట్టాడు. ఇంతలో వచ్చేముందు ఆర్డరిచ్చిన ప్రకారం క్యాంటీన్ బోయ్ ఇరవైమందికి సరిపడే టీని కెటిల్‌లో పోసుకుని కప్పులతో సహా వచ్చాడు.

ఎంత సేపు చూసినా స్టాపు ఎవరూ రాలేదు. బెల్ కొడితే అటెండర్ రాలేదు. కనీసం స్వీపరు కూడా రాలేదు. ఓ పావుగంట చూసి టీ కుర్రాడు వెళ్తానంటే వాడికి టీ ఖరీదు ఇచ్చేసి సెక్షన్ పరిస్థితి గురించి ఆలోచిస్తూ ఉండిపోయాడు సూపరింటెండెంట్ కోటేశ్వరరావు.

సాయంత్రం నాలుగయినా స్టాపు దగ్గర నుంచి ఒక్కఫైలూ రాలేదు కోటేశ్వరరావుకి. ఉదయం నుంచీ ఎవరూ ఏ పనీ చేయలేదని అర్థమయింది లేచి నేరుగా సెక్షన్‌లోకి వచ్చాడు.

టైపిస్టు ప్రేమాంజలితో సినిమా కథ చెబుతున్నాడు సీనియర్ అసిస్టెంట్ చింతామణి. క్యాషియర్ కూర్మానందం చెవులు కొరుకుతూ ఏదో చెబుతున్నాడు జూనియర్ అసిస్టెంట్

జస్వంతరావు. తనిచ్చిన అప్పుకు రావాల్సిన వడ్డీ గురించి తీవ్రంగా లెక్కలేస్తున్నాడు రికార్డు అసిస్టెంట్ నిత్యానందం. నేలమీద గోడకానుకొని కూర్చొని పాత చందమామ పుస్తకంలో భేతాళకథ చదువుతున్నాడు. స్వీపరు సింహాచలం, గోడకానించి ఉన్న స్టూలు మీద కాలు మడిచి కూర్చుని గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు అటెండర్ అప్పారావు. అక్కడి పరిస్థితి పూర్తిగా అర్ధమైంది సూపరింటెండెంట్ కోటేశ్వరరావుకి.

"ఏమిటిది? ఏం చేస్తున్నారు?" పెద్దగా అరిచాడు కోటేశ్వరరావు.

ప్రస్తుత పరిస్తితిలోంచి బయటకి వచ్చి అందరూ కోటేశ్వరరావు వైపు విసుగ్గా చూసారు.

"ఇప్పుడు సాయంత్రం నాలుగు గంటలు. ఒక్కరి దగ్గర నుంచి ఒక్కఫైలూ రాలేదు. ఇలా వుంటే సహించేది లేదు. రేపటి నుంచి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి. ఊరుకునేది లేదు" అని తిరిగి వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు కోటేశ్వరరావు.

"భంగు తాగేవాడికి హంగుగాళ్లు పదిమంది అన్నట్లు ఆయన మాటలు మనమంతా వినాలట. హో..... హో.......... హో" పెద్దగా నవ్వింది ప్రేమాంజలి.

"అయ్యగారికి ముందుంది ముసళ్ళ పండుగ" ముసిముసి నవ్వులు నవ్వాడు క్యాషియర్ కూర్మానందం.

"చందమామ కథలో భేతాళుడు జవాబు తెలిసీ సమాధానం చెప్పకపోతే నీ తల వెయ్యి ముక్కలవుతుంది అన్నట్లుంది ఈయన గారి ఆర్డరు" పకపకా నవ్వాడు స్వీపరు సింహాచలం.

వెంటనే తమ తమ బ్యాగ్‌లు సర్దుకుని బయటికి వెళ్ళిపోయారు. తెల్లవారింది. మరుసటి రోజు ఉదయం పది గంటలకు రావాల్సిన స్టాఫ్ యధాప్రకారం పదకొండింటికి వచ్చారు. పది గంటలకు ఓ అరగంట ముందుగా రావాల్సిన స్వీపరు కూడా వాళ్ళతోపాటు వచ్చి ఇష్టముండీ లేనట్లు అలా అలా ఊడ్చాడు. ఆ రోజు సెక్షన్ హాల్లోకి వచ్చిన కోటేశ్వరరావు వాళ్ళు నిన్న సాయంత్రం అరగంట ముందు ఆఫీసు వదిలినందుకుఈ రోజు అరగంట ఆలస్యంగా వచ్చినందుకు వాళ్ళను మందలించాడు. మధ్యాహ్నంలోగా నిన్నటి పెండింగ్ ఫైళ్ళన్నీ వ్రాయాలని హుకూం జారీ చేశాడు.

"సార్! మేం ఫిజికల్లీ హాండీకాప్డ్ పర్సన్సమనేగా మమ్మల్నిలా హెరాస్ చేస్తున్నారు?"

"మాతో పెట్టుకోకండి. ఇప్పటికి మూడు నెలలకొక సూరింటెండెంట్ లెక్కన మారుతున్నారు. మీరు అంతకాలం కూడా వుండలేరు."

"కుక్కకి పెత్తనమిస్తే చెప్పులన్నీ కొరికి పెట్టిందట కాస్త జాగ్రత్తగా వుండండి."

ఇలా అందరూ ఒక్కటై కోటేశ్వరరావు మీద తిరగబడ్డారు. దాంతో ఏం చేయలేక కోటేశ్వరరావు తిరిగి వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

అతని ఆఫీసరు ఆనందరావు ఈ సెక్షన్‌కు తనను సూపరింటెండెంట్‌గా వేస్తూ చెప్పిన మాటలన్నీ పదేపదే గుర్తుకు వచ్చాయి.

"మిస్టర్ కోటేశ్వరరావ్! నిన్ను 'డి' సెక్షన్‌కు వేస్తున్నాను. కారణం నీకున్న ఓర్పు, నేర్పు మాత్రమే. అక్కడ ఏ సూపరింటెండెంట్‌ని వేసినా పట్టుమని పది రోజులు కూడా వుండడంలేదు. అది రికార్డు సెక్షన్ కాబట్టి లైటుగా వుంటుందని మన ఆఫీసులోని వికలాంగులందరినీ అక్కడ వేసాను. వాళ్ళతో స్నేహంగా వుండి జాగ్రత్తగా పనిచేయించు. వికలాంగులను వేధించారనే రిపోర్టుతోనే ఇప్పటి వరకూ అందరినీ ట్రాన్స్‌ఫర్ చేయవలసి వచ్చింది. నువ్వలాంటి పరిస్థితి తెచ్చుకోకు" అని హెచ్చరించాడు.

ఆ మాటలు పదేపదే గుర్తుకు తెచ్చుకున్న కోటేశ్వరరావు ఆ రోజునుంచీ ఎవర్నీ ఏమీ అనలేదు. తనే ఫైళ్ళు వ్రాసుకుంటున్నాడు. అటెండర్ బదులు తనే ఆఫీసరు దగ్గరకు ఫైళ్ళు తీసుకెళ్ళి సంతకాలు పెట్టించుకొని వస్తున్నాడు. కోటేశ్వరరావుని ఒక ఆట ఆడించాలనుకున్న వాళ్ళకు అతని మంచితనం కొరకరాని కొయ్య అయింది. మూడునెలలు గడిచిపోయాయి.

ఇంతకాలం ఆ సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఎవరూ పనిచేయలేదు. కానీ అతన్ని అక్కడి నుంచి పంపడానికి సరైన కారణం దొరకలేదు వాళ్లకి. చివరకు ఆలోచించి ఆఫీసుకు వేళకు రమ్మనడం, ఆఫీసు టైమయ్యేంత వరకూ ఉండమనడం తప్పుగా భావించారు. అందరూ ఒక్కటై ఒక రోజు ఆఫీసర్ను కలిసి సూరింటెండెంట్ ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ అయిన తమను భయంకరంగా హింసిస్తున్నాడని చాడీలు చెప్పారు. అంతేగాక అతన్ని వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయకపోతే పరిస్థితి చాలా దూరం పోతుందని కూడా హెచ్చరించి వచ్చారు.

• • •          • • •          • • •

ఆరోజు ఒకటవ తేదీ. ఆరోజు జీతాలిచ్చే రోజు. పదకొండు గంటల కల్లా రిజిష్టరులో సంతకాలు పెట్టించుకుని జీతం బట్వాడా చేయడం సూపరింటెండెంట్ ఆనవాయితీ. అలాటిది ఒంటిగంటైనా సూపరింటెండెంట్ ఎవరికీ జీతం బట్వాడా చేయలేదు. అప్పటి వరకూ బెట్టుగా వున్న ఆఫీస్ స్టాఫ్ ఈ వింతేమిటో తేల్చుకుని రమ్మని సీనియర్ అసిస్టెంట్ చింతామణిని రెచ్చగొట్టి పంపారు.

సూపరింటెండెంట్ గదిలోకి వెళ్ళిన చింతామణి షాకయ్యాడు. ఎదురుగా ఒక అందమైన లేడీ సూపరింటెండెంట్ సులోచన.

తలెత్తి చూసిన సూపరింటెండెంట్ సులోచన ఉగ్రురాలైంది.

"బుద్ధిలేదూ. ఎవరి పర్మిషన్‌తో లోపలికి వచ్చావు?" అంటూ గర్జించింది.

ఇలాంటి పరుషమైన మాటలు కలలో కూడా ఊహించని చింతామణి "మేడమ్ కాస్త మర్యాదగా మాట్లాడండి. మిమ్మల్ని సూపరింటెండెంట్‌గా వేసినట్లు మాకు తెలియదు" అన్నాడు తనూ కోపంగా.

"ఏం నీకు చెప్పి వెయ్యాల్నా. గెట్‌లాస్ట్. ఓవర్‌గా మాట్లాడావంటే పరిస్థితి చాలా వరస్ట్‌గా వుంటుంది"

బిత్తరపోయిన చింతామణి తోక ముడిచి పిల్లిలా బయటకి నడిచాడు. కిటికీలోంచి చింతామణికయిన శృంగభంగం చూసిన ఆఫీసు స్టాఫంతా అతనికంటే ముందే వెళ్ళి ఏమీ ఎరుగనట్లు తమ తమ సీట్లలో కూర్చున్నారు.

వాతవరణమంతా గంభీరంగా వుంది. ఇంతలో బెల్ మ్రోగింది. ఇంతకుముందులా కాక భయం భయంగా లోపలికి వెళ్ళాడు అటెండర్ అప్పారావు.

"పది గంటలకు ఆఫీసంటే పదకొండు గంటలకు వస్తావా? నీ ఖాకీ యూనిఫారం ఏమయింది? ఎవరికన్నా అమ్ముకుని క్యాష్ చేసుకున్నావా? నిన్నిప్పుడే సస్పెన్షన్‌కు రికమెండ్ చేస్తున్నాను" అంటూ గర్జించింది సులోచన.

అన్నంతపనీ చేసేటట్లున్న ఆమెకు రెండు చేతులెత్తి నమస్కారం పెట్టి "క్షమించండమ్మా! రేపట్నుంచి ఆఫీసుకు టయానికి అరగంట ముందుగానే వస్తాను" అని వేడుకున్నాడు.

"ఇప్పటికి క్షమిస్తున్నా వెళ్లి ఆ స్వీపర్ని పిలువు"

భయం భయంగా బయటికి వచ్చి బలవంతంగా నవ్వాపుకొని లోపలికి వెళ్ళమన్నట్లు స్వీపరుకు సైగ చేశాడు.

"నాకేమన్నా భయమా?" అంటూ స్వీపరు సింహాచలం చదువుతున్న చందమామ బోర్లాపెట్టి లోపలకు అడుగుపెట్టాడు.

తల ఎగరేస్తూ లోపలికి వచ్చిన స్వీపరును ఉరిమి చూసింది సులోచన.

"ఏమిటిది నా గదిలో మూలమూలలా అంతంత బూజు వుంది. ఇది ఆఫీసా లేక పాడుపడిన గోడానా? రేపట్నుంచి పనిలోకి రాకు. ఆ కాకీ యూనిఫారం అటెండర్‌కు స్వాధీనం చేసి నువ్వింటికి వెళ్ళిపో."

సింహాచలం గర్వం చిటికెలో మాయమైంది.

"తప్పయిందమ్మా. రేపటి నుంచి సెక్షనును, మీ గదిని శుభ్రంగా వుంచుతాను" అంటూ క్షమాపణలు చెప్పుకున్నాడు.

"సరే ఇకనైనా బుద్ధిగా వుండు" అంటూ హుంకరించింది. బ్రతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు సింహాచలం.

సాయంత్రం నాలుగైంది. ఇంకా జీతాలు బట్వాడా చేయలేదు. అడగడానికి ఎవరికీ ధైర్యంలేదు. అసలు ఇస్తుందా? ఇవ్వదా? అన్న అనుమానం అందరిలో వుంది. చివరకు ఐదు గంటలకు అందరినీ గదిలోకి పిలిచింది.

"నిజానికి మీకు ఈ నెలలో జీతాలివ్వాల్సిన అవసరం లేదు. ఎందుకంటే గత నెలలో మీరు ఏమీ పని చేయలేదు కనుక. గత నెలలో మీరు ఎంత పని చేసారో ఆ

వివరాలు నా దగ్గర వున్నాయి. కానీ మీకు జీతాలిస్తున్నాను. ఎందుకంటే నేనుచేరిన ఈ రోజు నుంచయినా మీరు సక్రమంగా పని చేస్తారని" అంటూ రిజిష్టరులో సంతకాలు తీసుకుని అందరికీ జీతాలు బట్వాడా చేసింది.

రోజులు గడుస్తున్నాయి. ఇప్పుడు ఆఫీసు పని సక్రమంగా జరుగుతోంది. కబుర్లు, కాకరకాయలు. కథలు, కమామీషులు లేవు. ఎవరి పని వాళ్లు సక్రమంగా చేసుకుంటున్నారు. సూపరింటెండెంట్ సులోచన పిలుస్తుందంటే గడగడా వణికిపోతున్నారు. అలా ఎంత కాలమని?

అందరూ ఒకటై ఒకరోజు డైరక్టరు దగ్గరకు వెళ్లి ఆమెను వెంటనే మార్చాలని, లేకుంటే తాము నిరాహార దీక్షచేయాల్సివస్తుందని ఖచ్చితంగా చెప్పారు.

"కావాలంటే మిమ్మల్ని మారుస్తాను గాని ఆమెను మార్చే ప్రసక్తే లేదు" అని బల్లగుద్ది మరీ చెప్పాడు డైరక్టరు.

తిరిగి వచ్చిన అందరూ ఏకమై విషయాన్ని సీరియస్‌గా చర్చించి జిల్లా నాయకులకు తమ సమస్యను తెలియజేశారు. తమ అంగవైకల్యాన్ని గుర్తు చేస్తూ తమను అవమానిస్తుందని క్లెరికల్ స్టాఫ్, తనని చెప్పుతో కొడతానందని అటెండర్ అప్పారావు, తనను రూళ్ళకర్ర తీసుకుని సెక్షనంతా తరిమి తరిమి కొట్టిందని స్వీపరు సింహాచలం విన్నవించుకున్నారు.

ఒకరోజు సడెన్‌గా వచ్చిన జిల్లా నాయకులు ఇద్దరు "రండి సూపరింటెండెంట్ దగ్గరకు వెళ్ళి సంగతేమిటో తేల్చుకుందాం" అంటూ అందరినీ లోపలకు పిలుచుకు వెళ్ళారు.

లోపలికొచ్చిన నాయకులు సూపరింటెండెంట్ సీట్లో కూర్చొని వున్న సులోచనని చూడగానే అప్రయత్నంగా "మీరా?" అన్నారు.

తరువాత నమస్కరిస్తూ, "బాగున్నారా" అంటూ పలుకరించారు.

"ఆ...... బాగున్నాను కూర్చోండి" అంటూ నవ్వుతూ చెప్పింది సులోచన.

ఏదో జరుగుతుందని ఆశతో వచ్చిన ఆఫీసు స్టాఫ్‌కు ఈ వింత పరిస్థితి బోధపడ లేదు. అయినా నిరాశ పడలేదు. నాయకులు కూర్చుంటే వీళ్లందరూ చుట్టూ గుంపుగా నిలబడ్డారు.

"మేడమ్! ఇక మీ ఆటలు సాగవు" అంది ప్రేమాంజలి.

"మమ్మల్ని మీతోటి ఉద్యోగులుగా గౌరవించండి. మేమేం దారినబొయ్యే దానయ్యలం కాదు" కోపం ప్రదర్శించాడు చింతామణి.

"స్వీపరు గాడని వాడిని శానా సీప్‌గా జూసింది. అటెండర్‌గాడినని నన్ను ఆడుకుంది" మెల్లగా అన్నాడు అటెండర్ అప్పారావు.

"మేం వికలాంగులమనే మమ్మల్నింత చీప్‌గా చూడ్డం."

"అవును" అన్నారంతా కోరస్‌గా.

నాయకులు తలెత్తి వీళ్ళని అసహ్యంగా చూసారు. ఒకతను మాట్లాడడం మొదలు పెట్టాడు.

"బుద్ధిలేని మాటలు చెప్పకండి. మీ సూపరింటెండెంట్ సులోచన ఎంత గొప్పది. ఆమె మీద ఎన్నెన్ని చాడీలు చెప్పారు. ఆమె చెప్పుతో కొడతానందన్నారు. ఆమెకసలు కాళ్ళేవి చెప్పులు వేసుకోవడానికి? పదేళ్ళ వయసులో ట్రైన్ యాక్సిడెంట్‌లో మోకాళ్ళపైకి కాళ్ళు తెగిపోయాయి. ఆమె తనను రూళ్ళకర్రతో సెక్షనంతా తిప్పి తిప్పి కొట్టిందన్నాడు సింహాచలం. కాళ్ళులేని ఆమె సెక్షనంతా ఎలా తిరుగుతుంది? అబద్ధం చెప్పినా నమ్మేటట్లు ఉండాలయ్యా? ఇలా మాత్రం కాదు."

"మేం ఫిజికల్లీ హాండీకాప్డ్ పర్సన్స్‌మని మమ్మల్ని వేధిస్తుందన్నారు. మీ ఫిజికల్లీ హాండీకాప్డ్‌నెస్ ఎంత? చింతామణిది, సింహాచలానిది ముప్ఫయి అయిదు పర్సెంటు, కూర్మానందానికి, అప్పారావుకి ముప్ఫయి పర్సెంటు, జస్వంతరావు, ప్రేమాంజలి, నిత్యానందంలకు ఇరవై అయిదు పర్సెంటు అంగవైకల్యం. మరి సూపరింటెండెంట్ గారికి డెబ్బయి పర్సెంటు అంగవైకల్యం. ఇప్పుడు ఎవరు ఎవరిని వేధిస్తారో ఎవరికైనా అర్థమవుతుంది. ఆమె తన జీతంలో నెలనెలా ఫిజికల్లీ హాండీకేప్డ్ వెల్ఫేర్‌కి పదిశాతం ఇస్తుంది. మరి మీరు... సంవత్సరానికొకసారి ఇచ్చే యాభై రూపాయల చందాకోసం వంద సార్లు తిరగాలి. మీరేనాడయినా ఆఫీసుకి అరగంట ముందుగా వస్తే, ఆమె ఎలా ఆఫీసుకు వస్తుందో తెలుసుండేది. ఆఫీసు వరకూ ఆటోలో తీసుకువచ్చి ఆమెను ఆమె భర్త మోసుకొచ్చి కుర్చీలో కూర్చోబెడుతాడు. మీరేనాడయినా ఆఫీసు నుంచి ఓ అరగంట ఆలస్యంగా వెళ్లుంటే తెలిసేది ఆమె ఇంటికి ఎలా వెళ్తుందో? ఆమె భర్త ఆమెని తిరిగి మోసుకెళ్ళి ఆటోలో కూర్చోబెడుతాడు."

అందరూ ఏమీ మాట్లాడలేక తలలు వంచుకున్నారు.

ఇంతలో పాత సూపరింటెండెంట్ కోటేశ్వరరావు గదిలోకి వచ్చాడు. నాయకులు లేచి మర్యాదగా కోటేశ్వరరావుకి నమస్కరించారు. అతను తిరిగి నమస్కరించి ఖాళీగా వున్న సీట్లో కూర్చున్నాడు. సూపరింటెండెంట్ సులోచన చిరునవ్వు నవ్వింది.

"ఈయనెవరో తెలుసా?" అడిగారు నాయకులు.

"మా పాత సూపరిండెంటెండ్"

"అంతే మీకు తెలిసింది. ఈయనో త్యాగమూర్తి. మీ ప్రస్తుత సూపరింటెండెంట్ భర్త. ఆమె అంగవైకల్యం తెలిసీ ఆమెను భార్యగా స్వీకరించిన ఉత్తముడు.

మన వెల్ఫేర్‌కి పదివేలు డొనేట్ చేసి తాను అంగవైకల్యుడు కాకున్నా మన అసోసియేషన్‌కి జీవిత సభ్యుడయ్యాడు."

అందరూ మసకబారిన కళ్ళతో కోటేశ్వరరావును చూసారు. తాము అతన్ని వేధించిన వైనం గుర్తొచ్చి పశ్చాత్తాపంతో కుమిలిపోయారు. చేతులెత్తి ప్రేమాభిమానాలతో నమస్కరించారు ✸

*(ఆంధ్రభూమి మంత్లీ, ఏప్రిలు, **2001**)*